క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డాగ్ బంగ్లా వద్ద బుధవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల, పిల్లల స్పెషలిస్ట్ వైద్యులతో పాటు కంటి వైద్యులు కూడా పాల్గొని వివిధ పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉచితంగా మందులను, కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

నేడు మంచాలలో ఎమ్మెల్యే పర్యటన

మంచాల: మంచాల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరవుతున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎంఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

తలకొండపల్లిలో కబడ్డీ పోటీలు నేడు

తలకొండపల్లి: మండల కేంద్రంలో ఈనెల 11న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పుట్టినరోజు పురస్కరించుకొని మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు బంజారా యూత్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.10,116 అందజేస్తారన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన మహేశ్వరికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.11,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు వెల్జాల్‌లో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహ్మాన్, రాములు, దస్తగిరి, సత్యంగౌడ్, శ్రీశైలం, శివ, సుల్తాన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన ఇస్తారి (56) అనారోగ్యానికి గురై మంగళవారం మృతిచెందాడు. వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వ్యక్తిగతంగా రూ.2500 నగదు అందజేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3000 ఆర్థిక సహాయాన్ని ఉపసర్పంచ్ సుధాకర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సింగిల్ విండో డైరెక్టర్ రఘువర్ధన్‌రెడ్డి, శ్రీరామ్, కృష్ణయ్య, చెన్నయ్య, పాండు, రాజేందర్‌రెడ్డి, జంగయ్య, గిరి, మధు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన గండికోట యాదయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం నివాసంలో విశ్రాంతి పొందుతున్నాడు. తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న యాదయ్యను మంగళవారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, కృష్ణయ్య, యాదయ్య, భాస్కర్, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కడ్తాల్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని వివిధ గ్రామాలకు, తండాలకు చెందిన.. సర్యానాయక్, శాంతమ్మ, గోపాల్‌ను మంగళవారం ఆయా ఆస్పత్రులకు వెళ్లి ఎమ్మెల్సీ కసిరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట సర్పంచ్ హంస మోత్యానాయక్, హరిచంద్‌నాయక్, మోత్యానాయక్ ఉన్నారు.

కిడ్నాప్ కలకలం

ఇబ్రహీంపట్నం రూరల్: సొంత బావమరిది, అతని భార్యను బావ కిడ్నాప్ చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల గ్రామానికి చెందిన కేతావత్ విజయ, శంకర్ దంపతులు. వీరు నాదర్‌గుల్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. విజయ సోదరుడు ముడావత్ కృష్ణ దంపతులు కూడా అక్కడే నివాసం ఉన్నారు. వీరు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విజయ అతని భర్త శంకర్ తరచూ గొడవలు పడేవారు. దీంతో విజయ అన్న కృష్ణ పలుమార్లు బావను మందలించాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కృష్ణ కొంతమందితో కలసి బావ శంకర్, అతని భార్యపై దాడి చేసి కారులో తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



ఆమనగల్లు: మాట్లాడుతున్న కమిషనర్ శ్యాంసుందర్



అబ్దుల్లాపూర్‌మెట్: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, వైద్య సిబ్బంది

మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని అందుకే కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో మే 4 నుంచి జులై 12వరకు అన్ని వార్డుల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని కొత్తకుంటతండాలో నిర్వహించిన కంటి వెలుగు గ్రామసభ అనంతరం గ్రామ సర్పంచ్ శోభచందునాయక్ మైక్ ద్వారా ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమం గురించి వివరించారు.

గ్రామాలకు వైద్య బృందాలు

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమంపై ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కంటి వెలుగు కార్యక్రమం 5 నెలల పాటు నిర్వహించనున్నారని తెలిపారు. వైద్య బృందాలు గ్రామాల్లో పర్యటించి కంటి పరీక్షలు నిర్వహిస్తాయని కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, భారతమ్మ విఠలయ్యగౌడ్, పాండునాయక్, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, రమణ,వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్ కోరారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగనున్న కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సన్నాహక సమావేశం మరియు గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులందరూ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ఎస్‌ఓ రేణుక



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఓ, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ కట్టుబడి ఉందని వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తోందని కేజీబీవీ ఎస్‌ఓ రేణుక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సరపు క్యాలెండర్, డైరీలను ఆమె ఆవిష్కరించారు. యూటీఎఫ్ కృషి ఫలితంగానే అనేక ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమైయ్యాయని అన్నారు. మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు మహేష్, నాయకులు భక్యనాయక్, బాలకోటి, భిక్షపతి, రవి, యాదయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: గెలుపోటములను సమాన దృష్టితో చూస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రీమియర్ లీగ్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తగిన సహాయం అందజేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, రమేష్, ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు దశరథం, విజయ్, మహేష్, ప్రకాశ్, శివశంకర్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్‌రెడ్డి, క్రీడాకారులు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ఆయన స్వగ్రామం తులేకలాన్‌లో మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం సత్తు వెంకటరమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఏర్పుల చంద్రయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. గ్రంథాలయ సంస్థ ద్వారా ప్రజలకు విలువైన సమాచారాన్ని ఇస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవారికి గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మంచి ఉద్యోగులుగా తయారు కావడానికి గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, గ్రామ సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, మాజీ సర్పంచ్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

12న పీఎంఈజీపీపై అవగాహన సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో ఈనెల 12న ప్రధానమంత్రి స్వయం ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల పథకం (పీఎంఎఫ్‌ఎంఈ) పై నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరు కావలని ఆయన కోరారు.

రూ.13.30 లక్షలు పలికిన వేలంపాట

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివ, రామాలయాల్లో ఏడాది పాటు కొబ్బరిచిప్పలు, ఒడిబియ్యం, చీరల సేకరణ హక్కులకు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ముగ్గురు వ్యక్తులు పాల్గొనగా మైసిగండికి చెందిన కేతావత్ పరంసింగ్ రూ.13.30 లక్షలకు కొబ్బరిచిప్పలు, వడిబియ్యం, చీరల సేకరణ హక్కులను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అర్చక సిబ్బంది యాదగిరి, బోడియానాయక్,కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు పరీక్ష పత్రాలను అందిస్తున్న సీఐ ఉపేందర్

ఆమనగల్లు సీఐ ఉపేందర్

ఆమనగల్లు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చూచిరాత పరీక్ష పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నాలుగు మండలాల నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంతకు ముందు పరీక్ష పత్రాలను ఆమనగల్లు సీఐ జాత ఉపేందర్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ ఎంపీపీ తల్లోజు లలిత, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, జ్ఞానవాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు డా.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి రవీంద్రానంద్, లయన్స్‌క్లబ్‌ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, సభ్యులు డి.రంగారావ్, బికుమాండ్ల నర్సింహ, సత్యం, రామకృష్ణ, యాదగిరి, ఉపాధ్యాయులు రామనాధం, నర్సింహ, సతీష్, ప్రసాద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యాన్ని తగ్గించొద్దు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: సబ్సిడీ బియ్యాన్ని తగ్గించొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, తహసీల్దార్ సుచరితకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సబ్సిడీ బియ్యాన్ని ఒక కిలో తగ్గించి ఇవ్వాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. కోవిడ్ సమయంలో పనులు లేక ఆకలితో అలమటిస్తున్న పేదల కడుపులు నింపిన సబ్సిడీ బియ్యాన్ని తగ్గించడం దుర్మార్గమన్నారు. బియ్యంపై సబ్సిడీని ఎత్తివేసే కుట్రలో భాగంగానే కేజీ బియ్యాన్ని తగ్గించిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం బియ్యం తగ్గింపు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీరాములు, జంగయ్య, శివ, నర్సింహ, ప్రభు, శంకరయ్య, జంగచారిలు పాల్గొన్నారు.

భూ తగాదాల్లో పలువురిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: భూతగాదాల్లో పలువురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారయణ తెలిపారు. రెండు రోజుల క్రితం కొంగరఖుర్దు రెవెన్యూ పరిధిలోని ఓ భూమిలోకి అక్రమంగా చొరబడి పనిచేసే వారిపై దాడికి యత్నించినట్లు ఫిర్యాదు చేయడంతో కొంగకలాన్‌కు చెందిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గడ్డమల్లయ్యగూడలో క్షేత్ర ప్రదర్శన



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఇబ్రహీంపట్నం: కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గడ్డమల్లయ్యగూడలో క్షేత్ర ప్రదర్శనను నిర్వహించారు. క్రీడా శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల బ్యాంకు అధికారులు, గ్రామ రైతులు ఈ క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. క్రీడా నిర్మించిన ఫారంపాండ్‌తో పాటు కూరగాయల తోటలు, పశువుల దానా తయారీ, వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, సుధీర్, సర్పంచ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మొండిగౌరెల్లి గ్రామాన్ని మంగళవారం యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మీ సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీ, నర్సరీలను పరిశీలించి అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మదార్‌సావుల ఉర్సు



ఉత్సవాల్లో పాల్గొన్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామంలో మదార్ సావుల దర్గా ఉర్సు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యింది. దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, నాగమణి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బుగ్గరాములు, సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు రాజు, గ్రామశాఖ అధ్యక్షులు గుజ్జ యాదగిరి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి ఎమ్మెల్యే కావాలని ప్రార్థనలు

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని తులేకలాన్ ఉర్సు ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొడూరి రమేష్ ఆధ్వర్యంలో తులేకలాన్‌లో దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంబలి ప్రభు, కొడూరి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు మరమ్మతులు చేయిస్తాం



అమ్రాయి చెరువును పరిశీలిస్తున్న శ్రీకాంత్

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని అమ్రాయి చెరువును ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీకాంత్, డీఈ షర్మిలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇటీవల కరిసిన వర్షాలకు కట్ట కోతకు గురైందని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థల వినతి మేరకు అమ్రాయి చెరువును పరిశీలించినట్లు ఈఈ తెలిపారు. చెరువు విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఈఈ చెప్పారు. నిధులు మంజూరైన తక్షణమే కట్ట మరమ్మత్తులను నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాసుయాదవ్, సర్పంచ్ రఘుపతి, నరోత్తంరెడ్డి, బాలకుమార్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలివ్వాలి



యాదమ్మకు చెక్కు అందజేస్తున్న రాజు

మంచాల: అర్హులైన వికలాంగులందరికీ ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన గ్యార యాదమ్మకు కేవలం రూ.50 వేలు మాత్రమే దివ్యాంగుల కోటా కింద రుణం మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆమెకు చెక్కును కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. కేవలం ఓట్ల కోసం హామీలు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఇచ్చిన హామీలను అమలు పర్చాలన్నారు. గ్రామాల్లో చాలమంది రుణాలకు అర్హత కలిగి ఉన్నారని తెలిపారు. అర్హులైన వారందరికీ తప్పక రుణాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దివ్యాంగులను ఆదుకోవాలన్నరాఉ. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకుడు శివాజి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



షూ పంపిణీ చేస్తున్న రాంరెడ్డి దంపతులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. ఉప్పరిగూడ గ్రామానికి చెందిన లావణ్య రాంరెడ్డి దంపతులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో షూ పంపిణీ చేశారు. సర్పంచ్ రాంరెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేష్,వార్డు సభ్యులు పద్మమ్మ, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, రంగారెడ్డి, రోజా, శ్యామల, జ్యోతి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిపల్లి బూత్ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామకపత్రాలు అందజేస్తున్న పాండు

తలకొండపల్లి: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందని బీజేవైఎం కాలేజ్ ఔట్‌రీచ్ రాష్ట్ర కన్వీనర్ నీలకంఠం పాండు అన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంగళవారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో బూత్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షులుగా పుల్లారెడ్డి, వీరేశ్, అల్లాజి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శులుగా శ్రీను, మధుతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుమార్, ఉప సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు.. మన్యం, బాబు పాల్గొన్నారు.